# పత్రాణి పదభంగము

17. దగ్గుకు పరుషస్వరూపమునే
క్షయ అంటారు.

18. నిలకడగా నీరు త్రాగుటకన్న
పరుగెడుతూ బీరు త్రాగుట
కొందరికిష్టం

19. సమాన హక్కులుండాలి స్త్రీకి
ఆమెకు అర్ధస్థానం
పురుషుని ప్రక్కను

20. వంగదేశం వానికెక్కినది
టాగూర్లకు, టయిగర్లకున్న

21. సుధాకరుని "క్షుధాకరా" అని
సంబోధనచేస్తారు
ప్రజాసాహిత్యవాదులు

22. ప్రియుడు ప్రియురాలితో
కలకాలం ప్రేమిస్తానంటే అర్థం;
తన ప్రేమ స్వప్నప్రాయమని

23. మాయాప్రపంచమందు మనుచున్నట్టి
మానిసియొక్క తిరుగుబాటు సినిమా

24. కవులు చంద్రుని
అమృతమండలం అంటారు
కాని శాస్త్రజ్ఞులు చెప్పేది
మృతమండలం అని

25. వెలయాలికి
'రండా' పర్యాయపదం కద్దు
ఇందులో ఆహ్వానసూచక
ధ్వనివుందా ఏమి?


26. మనజాతిలోని సవర్ణ వివాహాలు,
సువర్ణ వివాహాలుపోవాలి

27. వధూవరులకు చదువుకన్నా
చదివింపు లెక్కువగావున్నవి

28. వనితాంధ్రుడు, వనితలూ ఒకేరకం
అందుకనే వాళ్ళనంతా పిల్లలంటారు

29. ఒక కీలుబొమ్మ
మరో కీలుబొమ్మతో ఏమన్నది?
"మరతలా" అని

30. చనిపోయినవాని నామస్మరణంకన్న
వాని పేరునామస్మరణంచేస్తుంటారు
బంధు మిత్రులు.



## నిత్యానందంగారి బొంబాయి విలాసయాత్ర

"ఏమండీ, మీరూ, మీ స్నేహితులూ కలిసి విజ్ఞానయాత్రకి వెళ్ళేయోగం మీ కెలానూ లేదు. నా స్నేహితురాలు బొంబాయి వెళుతోంది. దానివెంట బహుశా దాని మొగుడూ వెళుతున్నాడు. మనమూ వెళితే బాగుంటుందనుకుంటున్నాను. వొస్తారా" అంది ఓనాడు అకస్మాత్తుగా మా ఆవిడ.

"నాతో చెప్పకుండా మనం వెళదామని నువ్వు అనుకోడమేమిటి?" అన్నాను. అప్పుడప్పుడు అలా నిలవదీసి అడుగుతూ వుంటేనేగాని పెళ్ళాలు మరీ పేట్రేగి పోతారు.

"ఇప్పుడు నే చేస్తున్న పనేమిటి? మీతో చెబుతున్నానుగా" అంది.

"ముందే చెప్పవలసింది."

"దేనికి ముందే?"

"నీ స్నేహితురాలితో కలిసి వెళదామని నువు అనుకోడానికి ముందే."

"నా స్నేహితురాలితో వెళదామని అనుకున్నాను అన్నానా. వెళితే బాగుంటుందని అనుకున్నా నన్నాను. ఒకటే పరధ్యానం. చెప్పిన మాటలన్నా తిన్నగా విని అర్థం చేసుకోరు." అంది కించిత్తు విసుగూ, కించిత్తుకోపమూ గొంతుకలో స్ఫురింపజేస్తూ. మా ఆవిడ స్వరాన్నిబట్టి ఇట్టే మనసు కని పెట్టెయ్యగల శక్తిసామర్థ్యాలు సంపాదించు కున్నానేమో. ఓహో కొంచెం కారం పా లెక్కువగావుంది మాటలధోరణిలో. మనం ఒకటంటే తను రెండనే స్థితికి దిగిపోయే

ప్రమాదం లేకపోలేదు. నిలవదీసి అథారిటీ చెలాయించడానికి ఇది సమయంకాదు. అని క్షణంలో నిశ్చయాని కొచ్చేసి "ఇంతకీ ఎవరా స్నేహితురాలు. బొంబాయి ప్రయాణంలో ఆవిడదృష్టి ఏమిటి ? ధ్యేయం ఏమిటి" అన్నాను.

"వాస్తారా రారా. ముందర ఆ సంగతి తేల్చండి" అంది.

"నీ స్నేహితురాలెవరో తెలీకుండా ఆవిడ వెంట పడిపోవాలంటే."

"ఆవిడ వెంటపడి పొమ్మనలేదు. నా వెంట రమ్మంటున్నాను."

"నీవెంట రావడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. కాని"

"కానీ లేదు. అర్ధణా లేదు."

"నయాపైసలన్నా వున్నాయిగా"

"పైసలతో అయ్యేకార్యం కాదు. రూపాయలు కావాలి."

నా జోకు విని ఆనందించడానికి సుముఖురాలు కాలేదు మా ఆవిడ.

"బొంబాయి ప్రయాణం మనకో విలాస యాత్ర. దానికి చిలకా గోరింకల్లాగ మనిద్దరం కాక, వెనక తీతువు పిట్టల్లాగ ఎవరో స్నేహితురాలు. దాని మొగుడూ యేమిటి. కూడా ? మనమే సమయంచూసి ఎప్పుడో చల్లగా జారిపోదాం." అని ప్లేటు మార్చాను.

"ఆ. మిమ్మల్ని నమ్ముకుంటే ఈవూరు దాటామే. ఇంతకీ దూరప్రయాణానికి తోడుండడంమంచిది. నీళ్ళనమలక ప్రయాణానికి ఒప్పించి. మీనాన్నని అడిగిసొమ్ము పట్టుకురండి. వెంటనే టిక్కెట్లు కొనెయ్యాలిట" అంది.

ఏమన్నా సబవుగావుందీ. మేంబొంబాయి వెళ్ళాలని తను నిర్ణయం చేసింది. సొమ్ము మాత్రం నేను పట్టుకురావాలిట. అందులో మానాన్నని అడిగి. మూడ్ లో లేకపోయినప్పుడు మా ఆవిడతో మాట్లాడం యెంత కష్టమో. మానాన్నతో మాట్లాడం అంతకి రెట్టింపు కష్టం. ఆయన ఎప్పుడూ మూడ్‌లో వుండడు. ముఖ్యంగా డబ్బు ఖర్చుచెయ్యవలసొచ్చినప్పుడు. చివరికి ఏ సినీమాకివెళ్ళడానికి లాటి చిన్న సరదాకైనా సరే డబ్బు అడిగితే "చిల్లిగవ్వంత అర్జనలేదు. పెళ్లాంతో కులకడానికి మాత్రం ఎప్పుడూ సిద్ధం. "అని లెక్చరిస్తాడు. వారే అర్థం కాక అడుగుతాను. కులకడానికి కాకపోతే నసపెట్టి కోసుకు తినడానికటరా పెళ్ళాం! ఈ పెద్దవాళ్ళతో యిదో బ్రహ్మండమైన తంటా. ముద్దూ ముచ్చట తీరడంలేదని పెళ్ళిచేసుకునేదాకా పోరతాడు. తీరా పెళ్ళి చేసుకుని. ముద్దుముద్దుగా ముచ్చటలు తీర్చుకుందామంటే. మరీ పోరుపెట్టేస్తారు.

" నీ స్నేహితురాలి పేరైనా చెప్పకుండా నీవెంట బొంబాయిరమ్మని కట్టడి చేసేదానివి ప్రయాణానికి సొమ్ముకూడా నువ్వే సంపాదించు" అన్నాను.

"మీకు చేతకాదని కాళ్ళు పారజాపితే అంతే చెయ్యవలసొస్తుంది. అయినా కాస్త మొగతనం చూపించండి."

మాట ధాటీగానేవున్నా, మనిషి మెత్తనయినట్టు గొంతుకలో కనిపించగా "నా మొగతనం ముందు నీకు చూపించి యితరులకి....నిన్ను బొంబాయి ప్రయాణం కట్టిస్తున్న ఆ స్నేహితురాలి పేరేదో ముందర చెప్పు. అది బైటపెట్టడానికి



పూర్వం పెళ్ళిళ్ళల్లో తలుపులదగ్గిర మొగుడిపేరు చెప్పడానికి పెళ్ళికూతురు చేసినంత బెట్టూచేస్తున్నావు" అన్నాను.

"ఈ సరసాలకికావలసినంత సమయముంది సొమ్ము వసూలు చెయ్యడానికి నడుం బిగించండి." అని అస్త్రసన్యాసంచేసిన అర్జునుడి మీద శ్రీకృష్ణుడు విరుచుకుపడ్డట్టు నన్ను బొంబాయి ప్రయాణానికి తొందరపెట్టేసింది.

నాయనమ్మ కనక బతికివుంటేనా. అరగంటలో అవసరమయిన డబ్బంతా యిప్పించేసి వుండేది.

"కుర్ర నాగమ్మ సరదా పడుతున్నాడు. డబ్బిచ్చి పంపించర్రా." అనేది.

"యేడిశాడు. వాడు బొంబాయి వెళ్ళకపోతే ముంచుకుపోయిందేమీ లేదు. నే చూశాను కనకనా. అవూరు వాణ్ణి పంపించడానికి" అని యథాప్రకారం కసిరేసి వుండేవాడు నాన్న.

"వాడి డబ్బు వాడి కివ్వడానికి ఇదయిపోతానేమిటిరా" అనేది.

"వాడి డబ్బేమిటి ?"

"మరికట్నం తీసుకోలేదురా వాడిపెళ్ళికి? అదివాడిపేరని ఏ బాంకులోనో వెయ్యవలసింది. సొంతానికి వాడేసుకుంటున్నావు. కొంతసొమ్ము వాడికి విదుల్చు." అనేది. దాంతో నాన్న చిత్తయిపోయి. "పోరా. తీసుకుపోరా" అని నామీద నోట్లు గిరవాటు పెట్టేసేవాడు. నేనే సొంతంగా అడుక్కోవలసి వొచ్చేసరికి ఎంతో ఘర్షణ. మాఆవిడ కంఠం యెత్తి, ఓమాటు కాస్త దబాయించి. అది ఫలించకపోతే. శుక్రవారం పూట సావిట్లో గడపమీద కూర్చుని బెక్కులు బెక్కడం ప్రారంభిస్తేనే గాని సొమ్ము రాలలేదు. శుక్రవారంపూట యింట్లో గడపమీద కూర్చుని కన్నీళ్ళు కారిస్తే. మా అమ్మకే కాదు మానాన్నకికూడా భలే గాభరా. ఇంకేపాచికా పారకపోతే. మా ఆవిడ ఆ నారాయణాస్త్రం ప్రయోగించి నెగ్గుకొచ్చేస్తూ వుంటుంది. ఆవిడద్వారా మనం గెలుచుకొచ్చేస్తాం. కనకమరే అటంకాలు లేకుండా ఛలో బొంబాయి. కంది గుండ, ఆవకాయ, గోంగూర పచ్చడి. నిమ్మకారం. వెన్నకాచిన నెయ్యి జంతికలు వగైరా యిష్ట భోజన పదార్థాల డబ్బీలతో కూడిన ఒక పెద్దబుట్టతో సహా ఆ బుట్ట ఏ సీటు కిందికీ దూరక మమ్మల్ని కొంత అల్లరిపెట్టినమాట నిజమే. కిష్టయ్యగారు— అంటే మాతో వొచ్చే మా ఆవిడ స్నేహితురాలి మొగుడు.

"ఎందుకండీ ఇవన్నీ? ఎక్కడ పడితే అక్కడ మంచి భోజనందొరుకుతుందిట. ఎన్నో దక్షిణాది హోటళ్ళున్నాయిట" అన్నాడు."సాంబారుమెతుకులతో తృప్తిపడేవాళ్ళకి దక్షిణాది హోటళ్ళున్నాయని సంతోషంగాని పచ్చడి కలిపితేనేగాని భోజనం పూర్తికాని. మనకేం చాలతాయండి ఆ హోటలు తిళ్ళ"

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

"బొంబాయి స్టేషన్లోనే దిగుతాంలెండి."

"బొంబాయి స్టేషనంటూ లేదయ్యా"

"ఇదేమిటండీ. బొంబాయిలో స్టేషన్ లేదూ రైలు ఆగదూ!"

"బొంబాయికి స్టేషను వుందయ్యా. ఒకటి కాదు. రెండు. దాదర్, వి. టి అని పేర్లు వాటికి.

ఏమిటో ఇదంతా గజిబిజిగావుంది. రాజమండ్రి. ఏలూరులాటి రెండు స్టేషన్లున్న వూళ్ళున్నాయి. నాకు తెలుసు. కాని అవూరి పేరే ఏ స్టేషనుకీ లేకపోతే ఎలా!

"ఏ స్టేషన్లో దిగితే దగ్గిరండి ?"

"దేనికి దగ్గిర"

"వూరు చూడ్డానికి"

"వూరు చూడ్డానికి వూళ్ళో ఎక్కడ దిగినా వొకటేగా !" మహా తెలివిగా జవాబు చెప్పాననుకున్నాడు కాబోలు. నవ్వడం ప్రారంభించాడు. సాచి రెండు జెల్లలుకొడితే. పరాయి ప్రదేశం. తొందరపడకూడదు అని తమాయించుకున్నాను. కిష్టయ్య నిటార్గా కూర్చునే గుర్రుపట్టి నిద్రపోతున్నాడు. వాడు మేలుకుంటే సహాయమనికాదు.

దాదర్లో దిగాలా. వి. టిలో దిగాలా అని మేంనిర్ణయించుకోకుండానే గాదరొచ్చేస్తోం దని అందరూ పెట్టే బేడ సర్దుకోడం ప్రారంభించేశారు.

"ఏం చేద్దామండీ కిష్టయ్యగారూ."

"గాభరాపడకండి. నాకు దూరపు బంధువు ఒక పెద్ద ఆఫీసరున్నాడు ఈ వూళ్ళో. తిన్నగావాళ్ళింటికి వెళ్ళిపోయి. ఆయన సలహామీదే తరవాత ఏపనయినా చేద్దాం."

"ఎక్కడున్నాడు ఆయన. ఇంతకీ ఏ స్టేషన్లో దిగాలి." ఆయన ఎడ్రసుకోసం వెతకడం ప్రారంభించాడు కిష్టయ్య. జేబులన్నీ వెతికాడు. కనిపించదు. పెళ్ళానికిచ్చావంటాడు. ఆవిడ, అతనికే తిరిగి యిచ్చేనంటుంది. రభస. ఏమయినా ఎడ్రసు కాగితం కనిపించలేదు.

మద్రాసీవాళ్లు చాలామంది దాదర్ సమీపంలోనే వున్నారు. అక్కడే దిగుతే వారిని పట్టుకోవడం తేలిక. దాదర్లోనే దిగండి అని యెవరో సలహా యిచ్చారు. ఆంధ్ర రాష్ట్రం వొచ్చినా యింకా మన్ని మద్రాసీ వాళ్ళే అంటున్నారని కష్టంతోచినా, స్టేషను వొచ్చెయ్యడం వల్ల, వాదన పెట్టుకుని లాభం లేదని దిగిపోయాము. కిష్టయ్యకి ఆ తెలిసిన తెలుగు ఆఫీసరుగారి ఎడ్రసు తెలియదు సరికదా, పేరైనా తిన్నగా తెలీదు. ఏవో రెండు మూడు ఎ. బి. సి. డి. పొడి అక్షరాలు చెప్పి రావుగారు అంటాడు. ఆపొడక్షరాలు తిన్నగా తెలీవుట.

"రావుగారని" మాత్రం నిశ్చితంగా తెలుసుట, సవాలక్ష రావుగార్లుండే బొంబాయిలో, కిష్టయ్య దూరపు బంధువు రావుగారిని పట్టుకోడం ఎలా. ఇంకా తెల్లారలేదు. స్టేషన్లో దీపాలు ఆర్పేస్తే కటికచీకటి. సామాను దించిన కూలివాడు డబ్బిచ్చి పంపించెయ్యమని ఒకటే వొత్తిడి. ఇంత సామానూ టిక్కట్టు మాస్టరుగారు చూస్తే బోలెడంత ఎక్సెస్ చార్జీకూడా చేసి వుండునుట. ఆయనకన్నుగప్పి. సామాను బయట చేర్చారుట. కూలి డబ్బులేకాక. ఈ సహాయానికికూడా వాడికి సొమ్ము చెల్లించుకోవాలిట. వాడు ఓపట్టానపోడు. ఏదో తెలియని భాషలో ఇదంతా మాకు చెబుతాడు. కిష్టయ్య తనకి వొచ్చిన హిందీ పాడిమీద ప్రయోగించబోయాడు. మరికొంత గొడవ.

"మీరు తెలుగువారిలా వున్నారే" అని సూటూబూటూ వేసుకున్న ఓ పెద్దమనిషి స్వచ్ఛమయిన తెలుగులో పలకరించాడు. అమ్మయ్య తెలిసినమాట. ప్రాణం లేచొచ్చింది. మా పరిస్థితి చెప్పుకున్నాం. కూలివాడి గోల ఆయన మాకు చెప్పాడు. చివరికి రాజీచేసి, మూడురూపాయలిచ్చి వాడిని వొదిలించాడు. మా వూళ్ళో పావలా డబ్బులిచ్చి ఎక్కించిన సామాను దించిన కూలివాడికే మూడు రూపాయలు వొదిలిపోతే, ఈ వూళ్ళో ఎంతడబ్బు చాలేటట్టు !

"ఇక్కడ దొంగలుంటారు. డబ్బు జాగర్తగా పెట్టుకోండి" అన్నాడు ఆ తెలుగు పెద్దమనిషి. "తియ్యనిమాటలుచెప్పి సొమ్ము లాగేస్తారు. గూండాలూ, రౌడీలూకూడా చాలామంది వుంటారు. పరాయివాళ్ళని నమ్మకండి" అనికూడా హెచ్చరించాడు.

సమయానికి భగవంతుడిలా దొరికావు నాయనా, అని నేనేకాదు, మా ఆవిడకూడా సంతోషించింది. తన కిడివరకే ఇలాటి విషయాలన్నీ తెలిసినట్టు కిష్టయ్య మొహం పెట్టినా !

"పదండి మీ బంధువుని వెతికి పట్టుకుందాం'' అన్నాడు. ఆ తెలుగుపెద్దమనిషి.

అందరం కలిసిపోదాం అని నేను సలహాయిచ్చినా వినిపించుకోకుండా సామానులకి ఆడంగులకి నన్ను కాపలాపెట్టి వుండమని. ఆ తెలుగు పెద్దమనిషితో ఒక్కడూ బయలుదేరాడు కిష్టయ్య.

పావుగంటయింది. అరగంటయింది. కిష్టయ్యరాడు. వాడి పిల్లలు నిద్దరలేచిపోయి 'నాన్నోయ్' 'నాన్న కావాలోయ్' అని ఒకటే యేడుపు. వాళ్ళని వూరుకోపెట్టండని నేను సలహాయిస్తే. 'వెధవలు ఏడిచి ఏడిచి తోషొచ్చి వూరుకో వలసిందేగాని, ఇలాటప్పుడు మనం చెబితే మానరు. ఏడవనివ్వండి" అని తోసిపారేసింది గంగారత్నం. మా ఆవిడ దిగాలు పడిపోయి, పెట్టెమీద కూచుండిపోయింది. అయ్యో, మా ఆయన చెప్పిన మాటవిని, యిద్దరమే వొచ్చివుంటే ఈ బాధలన్నీ వుండకపోనుగదా అని మనస్సులో అనుకుంటూ వుండివుంటుంది.

నాకు ఆకలేస్తోంది. కాలకృత్యాలు తీర్చుకోవాలి. చుట్టుపక్క లెక్కడన్నా కూర్చుందామంటే ఎటుచూసినా పోలీసువాళ్ళు. మరీ దూరం వెళదామంటే తప్పిపోతానేమోనని భయం.

ఓ గంటయిన తరవాత కాళ్ళీడ్చుకుంటూ బుర్ర గోక్కుంటూ వొచ్చాడు కిష్టయ్య. ఆ తెలుగు పెద్దమనిషి జాగర్తగా దాచిపెడతానని, కిష్టయ్యగాడి దగ్గిర్నించి యాభయి రూపాయలు పుచ్చుకుని, నాలుగు సందులు తిప్పి అదృశ్యమయిపోయాట్ట.

"ఓరి వాజమ్మా. నువ్విలా చేస్తావని నాకు ముందరే తెలుసురా" అనుకున్నా మనసులో.

"ఆ వెధవ నెవడినో నమ్మి డబ్బెలా చేతిలో పెట్టారండీ" అంది గంగారత్నం పళ్ళు పటపట కొరుకుతూ.

"దూరదేశంలో సాటి తెలుగువాడు మోసం చేస్తాడని అనుకోలేకపోయాను" అన్నాడు.

"అయినా వాడికి డబ్బివ్వవలసిన అవసరమే మొచ్చింది. పెట్టెలో దాచండి అంటే మహా పొడిచేసేవాడిలా జేబులో పెట్టుకున్నారు."

"పెట్టమ్మా. అలా చీవాట్లుపెట్టి. గర్వం వొదిలించు'' అనుకున్నాను మనసులో.

కిష్టయ్య చెప్పుకొచ్చాడు వెండితెరమీద చూపించేలాటి కథ.

"నేనూ, ఆ తెలుగు పెద్దమనిషి కొంత దూరం నడిచేసరికి యిద్దరు ముగ్గురు మనుష్యులు మా వెనక తగిలారు. ఈలవేశారు. తెలుగుపెద్దమనిషి ఓమాటు వెనక్కి తిరిగి వాళ్ళని కూకలేస్తే వెనక్కి తగ్గారు. అప్పుడా పెద్దమనిషి చెప్పాడు. వీళ్ళు ఈ వూళ్ళో గూండాలు. కొత్తగా వూరికివొచ్చిన వాళ్ళ వెంటతగిలి సొమ్ము కాజేస్తారు. మీకూ ఈపాటికి ఇది జరిగివుండవలసింది. నేను వుండబట్టి వాళ్ళు వెనక్కిపోయారు. వాళ్ళకి నేనంటే హడల్. మీ డబ్బు జాగర్తగా దాచి పెడతాను నా కివ్వండి'' అన్నాడు.

"అబ్బె నాదగ్గిరేం డబ్బులేదండీ'' అన్నాను.

''ఓహో అయితే భయంలేదు. మీరు ఇక్కడే వుండండి. పక్కసందులో వాకబు చేసివొస్తానని వెళ్ళాడు. ఆయన అలా వెళ్లాడో లేదో ఆ గూండాగాళ్ళు మళ్ళీ వొచ్చారు.

''తుమ్ క్యాకర్తాహై'' అన్నాడు అందులో దున్నపోతులా వున్న ఒకడు.

"కుచ్‌నై" అన్నాను.

'తబ్ ఇవ్ గల్లీమే క్యాహై, శాయద్ తుమ్ చోర్‌హో పైసా నికాలో"

అని మీదకొచ్చాడు. వాళ్ల సొమ్ము లాగేసే వాళ్ళేకాని. ఆ క్షణంలో 'భాగ్ జావ్' అని కేకవేస్తూ ఆ తెలుగు పెద్దమనిషి ప్రత్యక్షమయాడు. 'నే చెప్పలా అండి. ఈవూళ్ళో జాగర్తగా వుండాలి. మీ సొమ్ము నాదగ్గిర దాచండి. మీ స్నేహితుడి యిల్లు పత్తా తెలిసి, మీరక్కడ చేరగానే భద్రంగా యిచ్చేస్తానన్నాడు. నమ్మి యిచ్చేశాను. ఆతరవాత రెండుసందులుతిప్పి మళ్ళీ కనిపించకుండా పోయాడు. అరగంట అయినా మళ్ళీ రాకపోతే మీరిక్కడ ఏమై పోతున్నారో అని స్టేషను దారి వాకబుచేసుకుంటూ ఇక్కడికి చేరుకున్నాను"

తెచ్చిన డబ్బంతా క్షవరమ్! కాదట. వున్న డబ్బంతా యిదేనని యాభయి రూపాయలు ఆ తెలుగువాడి చేతిలో పెట్టినా, మరో పదిరూపాయలు బనియను జేబులో దాచుకున్నట్టు, అవి మిగిలిపోయాయని, అవి దాచిన తెలివికి సంతోషిస్తూ ప్రజ్ఞ చెప్పుకోబోయాడు.

"పోలీసుకి రిపోర్టు చెయ్యండి." అంది మా ఆవిడ.

"ఎందుకులెండి. పోలీసుల చేతిలోపడితే యీ వూర్నించి తెమలలేము" అన్నాడు. నిజానికితనతెలివితేటలుబయటబడిపోతాయని సిగ్గుపడిదానికి ఒప్పుకోలేదు. బొంబాయంటే ఏదో మంచివూరు అనుకునేరు. అంతా శుద్ధ మోసం. మనం జాగర్తగా వుండాలి." అని మళ్ళీ లెక్చరు ప్రారంభించబోయాడు కిష్టయ్య. మోసపోయి డబ్బు క్షవరం చేసుకున్నదేమో తను, మాకెందుకు నీతులు చెప్పడం.

ఏమిటి తరవాత ప్రోగ్రాము!

గంగారత్నం దగ్గిర దాచిన డబ్బుకూడా కలుపుకుంటే కిష్టయ్య సకుటుంబంగా తిరుగు రైల్లో యిల్లు చేరడానికి మాత్రం సరిపోయినడబ్బు మిగిలింది. "చాలా అశుభం జరిగిపోయింది. ఇంకోమాటు జాగర్తగా రావొచ్చు వెళ్ళిపోదాం" అని గంగారత్నం సలహా యిచ్చింది.



అమ్మా గంగారత్నం. నువ్వు మీ ఆయనా ఏదో నిర్వాకం చేసి పెడతారని, మా ఆవిడ మీతో మమ్మల్ని లాక్కొచ్చింది. వూరుచేరగానే మీఆయన గంగలోదింపాడు. ఎప్పుడూ రైలెక్కి ఏవూరువెళ్ళే యోగం లేకుండా చేస్తావు అని మనసులో అనుకుని, వెళ్లాలంటే "మీరు వెళ్ళండి, మేము ఒకటి రెండురోజులు వుండి వొస్తాం" అన్నాను. "నిత్యానందం, నువ్వు మన వూళ్ళోనే పరధ్యానంగా దారులుతప్పి పోతూవుంటావు. ఈవూళ్ళో అసలు గజిబిజి అయిపోతావు. మేం వెళ్ళిపోయే పక్షాన మీరూ మాతోనే వొచ్చేసెయ్యండి" అంటాడు కిష్టయ్య! ఏం చెప్పను వాడి ధైర్యం. నోరునొక్కి పారేసేవాడు లేక.

"ఏదోఅశుభంమనని వెంటాడుతున్నట్టుంది. ఇప్పుడు వుండి లాభంలేదు మళ్ళీ వొద్దాం. మనమూ పోదాంపదండి" అని వాళ్ళపక్షమే పలికింది మా ఆవిడాను!

''మనం ఎన్నిమాటలు పడి ఎంత కష్ట నిష్ఠూరాలకి ఓర్చి, నువ్వు ఎంత హంగామా చేసినమీదట ఈ ప్రయాణానికి సొమ్ము వగైరాలు లభించాయి. వూరు చూడకుండా తిరిగిపోతే మళ్ళీ రావడం పడుతుందా. కొన్నేళ్ళదాకా, అమ్మా, నాన్నా మన్ని విడిచిపెడతారా. జరిగే అశుభమేమిటో జరిగేపోయింది. ఇంకా మోసం జరిగినా, డబ్బే కదా పోతుంది. మనుష్యుల్ని కొరుక్కు తినరుకద! ఈ వూళ్లో మంచి తెలుగువాళ్లూ వుండే వుంటారు. అలాటి ఆయన ఎవరైనా కనిపించి సహాయంచెయ్యరా! ఒకవేళ ఎవరూ దొరక్క, డబ్బా హరించిపోతే, కాలినడకనన్నా వూరుచూసే వెళదాం గాని వూరికే రైలెక్కొద్దు. మీరందరూ పోయినా, నేను రాను." అని ఖచ్చితంగా చెప్పేశాను. నా ధైర్యానికి పట్టుదలకి మా ఆవిడే దంగెత్తిపోయింది. రహస్యంగా మెచ్చుకుంది. దాంతో కిష్టయ్య గారి కుటుంబం వెళ్ళినా వుండినా మేం మాత్రం బొంబాయిలోవుండి రెండురోజులుండిపోవాలనే నిశ్చయమయిపోయింది. సాయంత్రందాకా తిరిగి వెళ్ళిపోడానికి రైలు లేదని తెలిసినతరవాత కిష్టయ్యకూడా" ఈ రోజంతా ఎలానూ వుండాలిగదా. రోడ్డుమీద కూచోలేము. ఆశ్రయం చూచుకోవాలి. అవసరమయితే యింటికి టెలిగ్రామిచ్చి సొమ్ము తెప్పించుకుంటాము.అందరంకలిసే వూరుచూసి,యింటికి తిరిగిపోదాం"అన్నాడు వొదలి పోతాడనుకుని సంతోషపడబోతూ వుంటే, మళ్ళీ తగులుకున్నావురా నాయనా, అనుకున్నాను.

"ఇప్పుడు తెల్లారిపోయింది. ఇహమనకి భయంలేదు.టాక్సీచేసుకునిహోటలుకిపోదాం, దగ్గిర్లో చవగ్గా ఎదైనా హోటలుందేమో, ఆ పోలీసాయన్ని అడిగితే చెప్పొచ్చు అంది" మా ఆవిడ.

"హోటలుకంటె సత్రందొరికితే మంచిదండి. ఇంత పెద్దవూళ్ళో సత్రాలుండక పోతాయా" అన్నాడు కిష్టయ్య. పైగా వెళ్ళి పోలీసు ఆయన్ని.

''ఇదర్ సత్రం కిదర్‌హై" అని అడిగాడు.

''క్యా'' అన్నాడు పోలీసు.

''సత్రం కహా(.''

''క్యా సత్రం.''

సత్రమంటే ఏమిటో ఆ పోలీసాయనికి హిందీ తెలుగుల్లో బోధచెయ్యబోయాడు.

''సత్రం గిత్రంవొద్దు. శుభ్రంగా హోటలుకే పోదాం. మీ వెళ్ళి హోటలు సంగతి అడిగిరండి ఆ పోలీసుని'' అని

మా ఆవిడ నాకు హుషారిచ్చింది. అనవసరంగా పోలీసువాళ్ళతో మాట్లాడ్డం నాకు కొంచెం భయమయినా, ఈ పరిస్థితుల్లో మనం ధైర్యం విడనాడకూడదని గుండె నిబ్బరంచేసుకుని, వాడి సలహా అడిగి, టాక్సీలోయెక్కి దగ్గరలోవున్న ఓ అరవ హోటలు చేరుకున్నాం.

వూళ్ళో చూడవలసిన వింతలూ, విశేషాలూ అన్నీ పాపం హోటలువాడే లిస్టు రాసియిచ్చాడు. రెండంతస్తులబస్సులెక్కాం. ట్రాములెక్కాం. మా చిన్నతనంలో మా జమీందారుగారి దగ్గిరుండేది అలాటి గుర్రబ్బండీకూడాయెక్కాం. ఎటొచ్చీ ఆగుర్రం కల్యంలావుంది. తిన్నగా తిండిపెట్టరు కాబోలు. మా జమీందారుగారి బగ్గికి కట్టిన జోడు గుర్రాలూ, మిలమిల్లాడుతూవుండేవి. మోటారుకారుకంటె చవక అని గుర్రంబండిలో ఎక్కితే, రెట్టింపు వొదిలిపోయింది. నిజానికి బొంబాయిలో అంతా అదోతమాషా. చవక అనుకున్నది ఖరీదు. పేరునిబట్టి ఏమీ వూహించుకోడానికి వీల్లేదు. 'గేట్‌వే ఆఫ్ ఇండియా'కి వెళితే అక్కడ గేటు లేదు. 'హేంగింగ్ గార్డెన్స్' చూస్తే, అది నేల మీదే వుందిగాని, ఎక్కడా వేళ్ళాడ్డంలేదు. మలబార్ హిల్సుమీదనించిచూస్తే, క్వీన్సు నెక్లేస్ కనిపిస్తుందన్నారు. కళ్ళుపొడుచుకు చూసినా ఎక్కడా నెక్లేస్ కనిపించలేదు. రాణీబాగ్‌లో కోతుల్నీ, ఆరే కాలనీలో గేదెల్నీచూస్తే బాగానే వున్నాయికాని, కోతుల్నీ, గేదెల్నీ చూడ్డానికి బొంబాయికి వెళ్లాలిట్రా. చెన్నపట్నంలోలా పెద్ద బీచిఅయినాలేదు. ఏదో చపాతట. అదే బీచన్నారు. మా వూళ్ళో యేట్లో వున్నంత ఇసకన్నాలేదు అక్కడ. పైకి చూడ్డానికి యిళ్ళు పెద్దవేగాని లోపల గూ ళ్ళూ లు, కిక్కిరిసిపోయిన జనం. ఎక్కడికి వెళదామన్నా తోసుకు ముందుకి పోడానికి వీల్లేదుట. ఏదో క్యూట. లైనులో నించోవాలి గంటలకొద్దీ. మొత్తంమీద నా కే కా దు మా ఆవిడ కి బొంబాయి ఏమీనచ్చలేదనుకో. పైగా, చూసినవన్నా ఫలాసాగా, మజాగా కబుర్లుచెప్పుతుంటూ చూద్దామంటే కిష్టయ్యగాడి ఫామిలీ అడ్డు. అన్నిటికీ ఏవో కామెంటరీలు చెబుతూ లెక్చర్లిస్తానంటాడు కిష్టయ్య. కనిపించిందల్లా బేరం చేసి, మా వూళ్లో యింతకంటె చవగ్గా దొరుకుతాయే ఇవి అని, అమ్మే ఆసామీచేత గుడ్లు ఎర్రజేయించుకునేది గంగారత్నం. వీటన్నిటినీ మించి, ఫిలిములో 'బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్'లాగ హమేషా వాడి పిల్లల సన్నాయి మేళం.

ఏమయినా, మాటపట్టుదలొచ్చింది కనక అన్ని కష్టాలకీ వోర్చి లిస్టుప్రకారం అన్నీ చూసి మరీ బొంబాయినించి కదిలాము. కిష్టయ్యగాడు కుదేలయిపోయాడు.

హుఁ ఏమనుకున్నావురా! నాయనమ్మ బతికుంటే "నాకుతెలుసురా: పెర్రినాగమ్మా. పైకి మెత్తనివాడిలా కనిపించినా, గట్టివాడే రా. చిన్నప్పుడు గుక్కపెడితే పావుగంటదాకా మానేవాడివి కాదు. ఉక్కిరిబిక్కిరి అయిపోయేవాడివి గాని, ఏడుపు మానేవాడివికాదు. అప్పుడే తెలుసురానాకు నువ్వు చాలా గట్టివాడివని." అని మెచ్చుకునేది. ఏడిశావు....మా ఆవిడా మెచ్చుకుందని చెప్పానుకాదురా! మానాయనమ్మలా, బాహాటంగా కాకుండా, సున్నితంగా, రహస్యంగా, విలాసంగా, చేసిందిరా ఆపని,

దానికీ థాంక్స్, బొంబాయికీ థాంక్స్.

□□□

జ్యోతి



# షాపింగానా

*లీలావతి కారుని అల్లూరాం బట్టలషాపు ముందర క్రీక్ మంటూ పార్కుచేసింది. అల్లూరాం గాభరాగా తన మెళ్లోని జరీ ఖండువా, సవరించుకుంటూ "రండి రండి. చాలారోజులకి దయ చేశారు" అని సాదరంగా ఆహ్వానించాడు.*

ఒక్కసారి షోరూమ్ లోని సేల్సుమెన్ కళ్ళు జిగేల్‌మన్నాయి. లీలావతి హుందాగా రాజమహల్‌లోని రాజకుమార్తెలా నడిచి వచ్చింది. అల్లూరాం తన బంగారపుపళ్ల అన్నీ బయటకు కనపడేలా నవ్వుముఖం పెట్టి కుర్చీ చూపించాడు. ఒక సేల్సుమేన్ ఫాన్ స్విచ్ ఆన్‌చేశాడు. వేరొక సేల్సుమేన్ "ద్రాక్ష"గ్లాస్ తీసుకవచ్చాడు. షోరూమంతటా, చెదురు మదురుగా వున్న జనం, లీలావతికి జరుగుతున్న సన్మానానికి అద్భుతపడి తమకి కావల్సిన గుడ్డలను ఎన్నుకోవడం మర్చిపోయి, శిల్పాల్లా నిలబడ్డారు. ఒకరిని ఒకరు కనుబొమ్మ లెగరేసుకుంటూ "ఎవ్వరీవిడ? మంత్రిగారి భార్యా లేక మార్కెటింగ్ ఆఫీసరా?" అన్న ప్రశ్న లేసుకుంటూ, వాళ్ళ ప్రశ్నలకి జవాబులుదొరక్క బిక్కముఖాలతో నిలబడ్డారు. స్త్రీ కస్టమర్స్ లీలావతి అందానికి, ఆమెయొక్క వేషభాషలకీ, ముచ్చటపడుతూ ఆమె అదృష్టానికీ, తమ నీరసత్వానికీ దిగులుపడ్డారు. పేవ్‌మెంట్ మీద నడిచిపోయే జనం, ఫ్లడ్ లైట్ల వెలుతురులో చేతిలో ద్రాక్ష గ్లాసులోని జ్యూస్‌ని, స్ట్రాతో కొద్దికొద్దిగా పీలుస్తూ, కూర్చున్న లీలావతిని చూసి "ఎవరీ మోనాలిసా?" అని ఆగి చూసి మరీ వెళ్ళుతున్నారు. లీలావతి ద్రాక్ష జ్యూస్‌ని సిప్ చేయటానికి అరగంటపట్టింది. క్రొత్తగా సేల్సుమేన్‌గా వచ్చిన ఫిరోజ్, పాత సేల్సుమేన్ అహమ్మద్‌ని అడిగాడు "ఎవరీవిడ?" అని.

"ఏమో నాకు తెలియదు. కాని ఈవిడ వస్తేమటుకు ఆ రోజు మన వ్యాపారం సాగదు. చూడు! వచ్చి అరగంటపైగా అయిందా? తన కేం కావాలో చెప్పదు. పోనీకూర్చుంటే కూర్చుందిలే. మాడల్‌గా పనిచేస్తుంది అనుకుందామనుకో! మిగిలిన కస్టమర్స్ ఆవిడ్నే చూస్తూకూర్చుంటారు

కె. వి. ఎస్. అచ్యుతవల్లి